



నాకా ఇల్లు బాగా నచ్చింది.

ఆరు వందలు నెలకి. నేను పనిచేసే కంపెనీ నెలకి అయిదువందలే ఇస్తుంది, ఇంటి అద్దెకోసం. మరో వంద ఎక్కువే అయినా వెంటనే ఒప్పుకున్నాను.

ఆ ఇంటి యజమాని చిరునామా, చెక్ ఏ విధంగా రాయాలి మొదలయిన వివరాలు ఒక కాగితంమీద రాసి దాన్ని అకౌంట్స్ ఆఫీసర్‌కి అందించాను మర్నాడు ఉదయం.

"ఆరు వందలా? మీ అలవెన్స్ అయిదు వందలేనే?" అడిగాడు ఆయన.

"వంద నాజీతంలోంచి డిడక్ట్ చేయండి. ఇల్లు బాగుంది." చెప్పాను.

"ప్రతినెలా జర్నల్ ఎంట్రీ పాస్ చెయ్యాలి" గొణుక్కున్నాడు.

కేషియర్లు, అకౌంట్స్ ఆఫీసర్లు ప్రతి చిన్న విషయానికీ గొణుక్కుంటారు. అది వాళ్ళు చేసే వృత్తివల్ల వచ్చే అలవాటై ఉండవచ్చని నా అనుమానం.

హైదరాబాద్ కన్నా బళ్ళారి బాగుండదు. కానీ బదిలీ అప్పకోలేక

పోయాను. ఎండాకాలం హైదరాబాద్‌కన్నా బళ్ళారిలో టెంపరేచర్ అధి కంగా ఉంటుందని చెప్పారు హైదరాబాద్ బ్రాంచిలో ఎవరో.

సాయంత్రం ఇంటిముందు తోటలో కూర్చుని ఉంటే ఆమె నాకంట పడింది.

ఆమెకి పాతికేళ్ళు కూడా ఉండవు. చామన ఛాయ. అయిదు అడు గుల నాలుగంగుళాల ఎత్తు ఉండవచ్చుని అంచనా వేశాను. పొడుగాటి జడ. ఆకుపచ్చ అర్గండీ చీర సన్నగా ఉన్న ఆమెకు బాగా అమరింది. మరీ అంద గత్తె కాకపోయినా అనాకారి ఎంతమాత్రం కాదు.

మా ఇంటికి, ఆమె ఇంటికి పక్క సరిహద్దు గోడ ఇంకా కట్టలేదు. గోడకి పునాది మాత్రం కట్టారు. రెండు ఇళ్ళు ఒకరివే కాబట్టి సరిహద్దు గోడ విషయంలో అశ్రద్ధ చేసి ఉంటారనుకున్నాను.

ఆమె దృష్టి నా మీద పడటంతో కుర్చీలో కొద్దిగా కదిలాను అప్ర యత్నంగా. నేను చదువుతున్న నవల 'ది ఫేన్' లోకి దృష్టి మరల్చాను. నా కళ్ళు ఎక్కువసేపు నే చదివే పేజీమీద ఉండలేకపోయాయి.

తల ఎత్తి చూశాను. ఎర్రటి ప్లాస్టిక్ బకెట్‌లోని నీళ్ళని ఎర్రటి ప్లాస్టిక్ మగ్‌లోంచి తీసి దానిమ్మ చెట్టు మొదట్లో పోస్తూంది.

రోజూ సాయంత్రం తోటలో కూర్చోవడం బాగుండదేమో అన్పిం చింది నాకు. బ్రహ్మచారిని.

రెండుపేజీలు చదివి తల ఎత్తి చూస్తే ఆమె లేదు.

ఆ రాత్రి ఇంటికి ఉత్తరం రాశాను అమ్మకి, ఇల్లు దొరికిందని, వెంటనే రైల్లో బెర్త్ రిజర్వ్ చేసుకోమని. బ్రహ్మచారి తల్లితో ఉంటే పక్క ఇళ్ళలో వారు గౌరవంగా చూస్తారు. ఒంటరిగా ఉంటే 'వంద కోతుల' వంక చూసినట్లుగా చూస్తారని నా స్వానుభవంగా తెలుసు నాకు.

రెండురోజులు గడిచాయి. రోజూ ఆఫీస్‌కి ఉదయమే లేచి వెళ్ళడం, చీకటి పడ్డాక వచ్చి వంటగదిలో చేతులు కాల్చుకోవటం— మగవాళ్ళు వండటాన్ని అలా అంటారనుకుంటాను—నిద్రవచ్చేదాకా ఘంటసాల భక్తి గీతాలు, పోషన్ ఆఫ్ ఫేంటసీ, మెలోడీస్ ఆఫ్ ముఖేష్— రకరకాల

పాటలు వింటూ, పుస్తకాలు చదువుకుంటూ కాలక్షేపం చేయటంతో రెండు రోజులు గడిచాయి.

మూడో రోజు ఆదివారం.

నాలుగింటికే మెలకువ వచ్చేసింది రోజులాగానే. బద్దకంగా అలాగే పడుకున్నాను. నాలుగున్నరకి లేచి, మొహం కడుక్కుని, నీళ్ళు పట్టుకుని, వెంకటేశ్వర సుప్రభాతం రికార్డ్ ప్లేయర్‌లో ఉంచి ఆన్ చేశాను.

స్టవ్ వెలిగించి రెండు కోడిగుడ్లతో ఆమ్లెట్ చేశాను. బ్రేక్‌ఫాస్ట్ అయ్యాక కుర్చీ వేసుకుని గార్డెన్‌లో కూర్చున్నాను.

పక్కింటి అమ్మాయి పూలు కోస్తోంది. ఆ రోజు తలంటి పోసుకున్న గుర్తుగా తలకి టవల్ చుట్టుకుని ఉంది, వెంట్రుకలలోని నీళ్ళు ఆ టర్కిష్ టవల్ పీల్చడానికి. అరికాళ్ళకి పసుపు రాసుకుని ఉంది. వెండి మెట్టెలమీద సూర్యరశ్మి పడి మెరుస్తున్నాయి అవి.

భర్త స్కూటర్ తడిగుడ్డతో తుడిచింది, పూలు కోశాక. పేపర్ రాగానే లోపలికి వెళ్ళాను నేను.

ఉదయం తొమ్మిదిన్నర అయి ఉంటుంది. స్కూటర్ చప్పుడు వినిపించి వంటగది కిటికీలోంచి బయటికి చూశాను.

పక్కింటి అబ్బాయి స్కూటర్‌ని గేటులోంచి బయటికి తీసుకెళుతున్నాడు. అతనికి ముప్ఫైలోపుంటాయి. తెల్లగా, ఆమెకంటే గుప్పెడు పొడుగ్గా ఉన్నాడు. చక్కని జంట!

ఆమె భర్తని రెండు మూడుసార్లు చూశాను. భార్య అంటే అతనికి విపరీతమయిన ప్రేమ. తప్పదు కాబట్టి వెళుతున్నాను అన్నట్లు వెళ్ళాడు. సందుచివర స్కూటర్ ఆపి చెయ్యి ఊపాక ఎవరూ చూడటం లేదనుకుంటే గాల్లోకి చేత్తో ముద్దు విసిరాక మళ్ళీ పోనిస్తాడు స్కూటర్‌ని.

పెళ్ళయి అట్టేకాలం అయివుండదు.

పదిన్నరకల్లా వంట పూర్తయింది.

మళ్ళీ గార్డెన్‌లోకి వచ్చాను.

క్షణకాలం పక్కింటి ముందున్న గార్డెన్‌లోని ఆ అమ్మాయిని గుర్తుపట్టలేక పోయాను.

ఎప్పుడూ చీరలో కనిపించే ఆమె పంజాబీ డ్రెస్‌లో ఉంది. ఆ దుస్తుల్లో ఆమె ఒంటి ఒంపులు స్పష్టంగా కనబడుతున్నాయి.

చీర అందం దాచేస్తుందనిపించింది, ఆమె చేతిలో చాట ఉంది. వేరుసెనగపప్పుని చెరుగుతోంది. వేరుసెనగపప్పు మీద ఉండే ఎర్రటి పొట్టు గాలిలో కలిసి పోతోంది చెరుగుతూంటే.

ఆమె నా వంక ఒకసారి చూసింది. తన పని తాను చేసుకుపోతూ.

ఒక నిముషం కూడా అయి ఉండదు. గేటు బయట రోడ్డుమీద మోటార్ సైకిల్ ఒకటి ఆగింది. దానిమీద కూర్చున్న వ్యక్తి హారన్ కొట్టాడు గట్టిగా. అతనివంక చూశాను.

విశాలమయిన ఛాతీ మీద బెల్స్ షర్ట్. కళ్ళకి నల్లద్దాలు- ఫ్రెంచ్ కట్ మీసం- హుందాగా ఉన్నాడు.

పక్కింటి అమ్మాయి దృష్టి అతని మీద పడగానే చేతిలోని చేటని నేలమీదపడేసి ఒక్కగెంతులో గేటు దగ్గరికి వెళ్ళింది. గేటు తెరిచి అతని భుజం మీద చరిచి కన్నడంలో గబగబా ఏదో చెప్పింది.

ఆమె తీరు, ప్రవర్తన నాకు ఆశ్చర్యాన్ని కలిగించాయి. ఎంతో చొరవగా మాట్లాడింది అతనితో.

వెనక్కి తిరిగింది ఆ అమ్మాయి. అతను ఆమె జడ పట్టుకుని ఆపాడు. గట్టిగా అరిచింది. కోపంగా అతని నెత్తిమీద మొట్టి విడిపించుకొని లోపలికి వెళ్ళింది. చెప్పులతో బయటికి వచ్చింది కొన్ని క్షణాల్లో.

గేటు దగ్గరికి నొక్కి అతని మోటార్ సైకిల్ మీద కూర్చుంది వెనకాల. మోటార్ సైకిల్ బయలుదేరింది. కుడిచేతిని ఛాతీ చుట్టూ వేసి, అతని వీపుకి తన ఛాతీని బలంగా ఆనించి కూర్చుంది— ఎంతో ఎంతో సన్నిహితంగా.

సోదరుడు కాడు. మరెవరు? పెళ్ళయిన అమ్మాయితో అంత చనువుగా ఇంకెవరు ఉండగలరు?

నాకు మనస్సు వికలం అయిపోయింది. భర్త పనిమీద— బహుశా

ఆఫీస్‌కి—వెళ్ళడంతో ముందు ఏర్పాటు చేసుకున్న విధంగా ఆమెను తీసు కెళ్ళడానికి ఆమె ప్రియుడు వచ్చాడు అనిపించింది.

బయటవాడై ఉండడు. బావో, మామయ్యో అయి ఉంటాడు—వాళ్ళిద్దరినీ మోటార్ సైకిల్ మీద చూసినా ఆమె భర్త తప్పుగా అనుకోడు.

అతని ముందు వాళ్ళిద్దరూ అలా ప్రవర్తించరు, బహుశా.

భోజనం అయాక నిద్రపోయాను. మోటారుసైకిల్ చప్పుడుకి మెలకువ వచ్చింది నాకు. లేచి కిటికీలోంచి బయటికి చూశాను.

పక్కింటి అమ్మాయి మోటార్ సైకిల్ మీదనుంచి దిగింది. గేటు దాటి లోపలికి వచ్చి వెనక్కి తిరిగి ఇంటి కాంపౌండ్‌లోంచి గాల్లోకి ముద్దు విసిరింది. అతను దాన్ని పట్టుకున్నట్లు అభినయించి తన పెదవులకి తాకించుకున్నాడు.

మరీ సోషల్‌గా ఉండే బావా మరదళ్ళయి ఉండవచ్చన్న ఆలోచనతో నన్ను నేనుతృప్తి పరచుకున్నాను. ఆ అమ్మాయిని చెడ్డగా వూహించుకోవడం నాకే నచ్చలేదు. కాని ఆ సన్నివేశం ఆ అమ్మాయి మీద నాకు ఉన్న కొద్దిపాటి నమ్మకాన్ని కుంగదీసేసింది.

మోటార్ సైకిల్ వెళ్ళిపోయినా, అది నిలబడి ఉన్న ఖాళీ స్థలాన్ని చూస్తూ అలాగే కూర్చుండిపోయాను. అయోమయంగా ఉంది నాకు.

అరగంట తర్వాత స్కూటర్ వచ్చి ఆగింది. ఆ అమ్మాయి గబగబా వచ్చి గేటు తలుపు తెరిచింది. అతను స్కూటర్ పార్కు చేసేదాకా ఆగి, అతనితో నవ్వుతూ కబుర్లు చెపుతున్న ఆమెని చూస్తే చెప్పలేనంత అసహ్యం వేసింది నాకు. అతన్ని చూస్తే జాలి కలిగింది.

నిజం తెలిస్తే ఏమయిపోతాడు!

o o o

మళ్ళీ ఆదివారం స్టేషన్‌కి వెళ్ళి అమ్మను తీసుకువచ్చాను.

"ఇల్లు బాగుంది. ఎంతో సౌకర్యంగా ఉంది." చెప్పింది అమ్మ.

"ఇల్లు మారుద్దామనుకుంటున్నాను." చెప్పాను.

"ఏం? ఇంకా మంచి ఇల్లు దొరికిందా?" అడిగింది.

"అవును." చెప్పాడు పొడిగా.

స్కూటర్ మీద పక్కింటి అమ్మాయి భర్త ఉదయం తొమ్మిది న్నరకి వెళ్ళిపోయాడు. పదిన్నరకి మోటార్ సైకిల్ వచ్చిన చప్పుడు విని పించింది. కిటికీలోంచి చూశాను. పక్కింటి అమ్మాయి షర్ట్, జీన్స్‌లలో అతనితో వెళ్ళిపోయింది. ఆ దృశ్యం అమ్మకంట పడకపోవడంతో తృప్తి పడ్డాను. ఎప్పటిలాగానే నాలుగున్నరకి ఇంటి దగ్గర దింపి వెళ్ళిపోయాడు అతను.

అయిదింటికి స్కూటర్ మీద వచ్చాడు భర్త.

ఆ రోజు సాయంత్రం వేరే ఇల్లు చూశాను. నే నుంటున్న ఇంటి మీదట వసతులు తక్కువ. అయినా మారదలుచుకున్నాను. ఇంటికన్నా పొరుగువాళ్ళు మంచివాళ్ళవటం ముఖ్యం నా ఉద్దేశంలో.

అమ్మ అడుగుతుంది అంత మంచి ఇల్లు వదులుకుని ఇక్కడికి మారావేం అని. నమ్మే సమాధానం ఏదైనా ఆలోచించి చెప్పాలి.

అద్దె మర్నాడు ఆఫీస్‌కి వచ్చి తీసుకోమని చెప్పాను ఇంటాయనకి. ఇల్లు ఫిక్స్ చేశాక సగం భారం తగ్గినట్లనిపించింది నాకు.

ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లోంచి 'ఆబా' ఎల్. పి. పెద్దగా విన బడుతోంది. ఎవరో కొత్త వాళ్ళు వచ్చారనుకున్నాను. అమ్మ ఇంగ్లీషు పాటలు ఎప్పుడూ పెట్టుకోదు.

వాళ్ళే!

పక్కింటి అమ్మాయి!

ఆమె భర్త!!

అమ్మ వాళ్ళిద్దరినీ నాకు పరిచయం చేసింది.

"నమస్తే. మీరు కాంటినెంటల్ ఐరన్ వోర్క్స్ లిమిటెడ్‌లో పని చేస్తున్నారని తెలియదు. నా స్నేహితుడొకడు ఫోర్‌మన్‌గా పనిచేస్తు న్నాడు...." అతను నాతో మాటలు కలిపాడు.

అతను చాలా మంచివాడనిపించింది మాటలనిబట్టి. రైల్వేలో ఇంజ నీర్‌గా పనిచేస్తున్నా, అతనిలో ఎంతమాత్రం గర్వంలేదు. నాకు బాగా నచ్చాడతను.

ఆమె ఎంతో అణకువగా 'ఫిలింఫేర్' తిరగేస్తూ కూర్చుంది. నావంక కన్నెత్తి కూడా చూడలేదు.

"తెలుగు కొద్ది కొద్దిగా వచ్చుట వీళ్ళకి. కన్నడం నేర్పుతుందటనాకు. తెలుగు నేర్చుకోదట." నవ్వుతూ చెప్పింది అమ్మ.

ఆమె నా వంక క్షణకాలం తలెత్తి చూసింది. ఆమె రహస్యం నాకు తెలుసని తెలిస్తే ఏం అనుకుంటుంది?

అతను నాతో పిచ్చాపాటీ మాట్లాడసాగాడు. ఆమె, అతను ఎప్పుడు ఇంట్లోంచి బయటికి వెళ్తారా అని ఉంది నాకు. బయటికి మాత్రం అతను చెప్పేది ఆసక్తిగా వింటున్నట్టు నటించసాగాను మర్యాదకోసం.

బయట మోటార్ సైకిల్ ఆగిన చప్పుడు వినిపించింది.

ఆమెవంక చూశాను. ఆమెకూడా విన్నట్లుంది ఆ చప్పుడు. టక్కున మేగజైన్ మూసి నిలబడింది. భర్తతో కన్నడంలో ఏదో చెప్పి బయటకి నడిచింది గబగబా.

ఒక నిముషం తర్వాత లోపలకి వచ్చింది.

వెనకాల అతను!

"ఇతను మిస్టర్ హరిశ్చంద్ర. బేంక్ మేనేజర్." పరిచయం చేశాడు పక్కింటి ఆమె భర్త. అతన్ని ముట్టుకోవాలంటే అసహ్యం అనిపించినా, అంటీ అంటనట్లు అతనితో కరచాలనం చేశాను. కొద్దిగా తెల్లబోయాడు, నేను అయిష్టంగా కరచాలనం చేయడం గమనించి.

"మిమ్మల్ని ఆదివారం చూశాను మీరే వంట చేసుకుంటారు కదూ?" నవ్వుతూ అడిగాడు.

నేను జవాబు చెప్పేలోగా ఇంకొక ఆమె లోపలికి వచ్చింది.

కళ్ళు ఆర్పకుండా ఆమె వంకే చూశాను— తెల్లబోతూ.

"నా చెల్లెలు" పరిచయం చేసింది పక్కింటి అమ్మాయి కొత్తగా వచ్చిన ఆ అమ్మాయిని.

ఆశ్చర్యంగా పక్కింటి అమ్మాయి చెల్లెలి వంక చూస్తూండటంతప్ప ఆమె 'నమస్తే' అన్నా, నేను తిరిగి 'నమస్తే' అనలేకపోయాను.

"నా భార్య" హరిశ్చంద్ర చెప్పాడు. నేను ఆ అమ్మాయి వంకే ఇంకా చూడటం గమనించి.

"నమస్తే...." గొణిగాను.

"ఆషాఢమాసం కాబట్టి మా ఇంట్లో ఉంటోంది. రెండు నెలలయింది పెళ్ళయి." చెప్పాడు పక్కింటాయన.

ఛీ!

ఎంత సంకుచితంగా ఆలోచించాను పక్కింటి అమ్మాయి గురించి!!

"మీరు కవలలా?" అడిగింది అమ్మ ఆ ఇద్దరమ్మాయిలని పరీక్షగా చూసి.

"అవును.... రెండు నిమిషాల తేడా నేను చిన్న." చెప్పింది కొప్పాన్‌లో ఉన్న పక్కింటి అమ్మాయి చెల్లెలు. ఇద్దరూ అచ్చు గుద్దినట్లున్నారు.

ఆ అమ్మాయి మంచిదే అనే సత్యం తెలియడంవల్ల మనసు తేలిక పడింది. కాని ఒక పక్క మనసులో ముల్లుగుచ్చుకున్నట్లుగా బాధ, పవిత్రమయిన ఆ అమ్మాయి గురించి అసహ్యంగా భావించినందుకు.

మర్నాడు ఉదయం ఆఫీస్‌కి వెళుతూ నేను చూసినకొత్త ఇంటి యజమానితో చెప్పాను, ఆయన ఇల్లు అవసరంలేదని.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక, 27-1-82 సంచిక)